క్లుప్తంగా

పాలిటెక్నిక్ అధ్యాపకునికి డాక్టరేట్


రాజ్‌కుమార్

అద్దంకి: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా పని చేస్తున్న రాజకుమార్‌కు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలపై తన పరిశోధన సాగిందని రాజకుమార్ శనివారం తెలిపారు. అంతరించి పోతున్న మానవతా విలువల్ని, విశ్వ మానవ కుటుంబం ఆవశ్యకతను రవీంద్రుడి రచనల ఆధారంగా నేటి ప్రపంచానికి తన పరిశోధన చాటి చెబుతుందన్నారు. ప్రొఫెసర్ ప్రభాకర్ ఈ పరిశోధనా వ్యాసానికి పర్యవేక్షకునిగా వ్యవహరించారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

అద్దంకి రూరల్: మండలంలోని చినకొత్తపల్లి గ్రామంలో ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఉన్న 60 ప్రభుత్వ భూమిలో గత గత ప్రభుత్వ హయాంలో 20 సెంట్ల సచివాలయాన్ని, 10 సెంట్లలో హెల్త్ క్లీనిక్ సెంటర్ నిర్మించారు. అప్పటి నుంచి గ్రామానికి కొందరు మిగిలిన 30 సెంట్ల భూమిని ఆక్రమించి పేడ దిబ్బలు వేసుకుంటున్నారు. ఈమేరకు శనివారం తహసీల్దార్ శ్రీ చరణ్ ఆధ్వర్యంలో పోలీసుల సహకారంతో ఆక్రమణ భూమినిలోని దిబ్బలను పొక్లెయిన్‌తో తొలగించి స్వాధీనం చేసుకున్నారు.

ఎవరి కోసం ఈ చాకిరీ?

- వరి రైతులకు దొరకని మద్దతు ధర
- కల్లాల్లో ధాన్యం..రైతుల కళ్లల్లో దైన్యం
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక అవస్థలు
- తక్కువ ధరకే అమ్ముకుంటున్న అన్నదాత


వేటపాలెం: అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోవాల్సిన దుస్థితి నెలకొంది. మద్దతు ధరపై కూటమి సర్కారు చేతులెత్తేయడంతో వరి రైతులు రోదిస్తున్నారు. వరికి గిట్టుబాటు ధర రూ.2,240 ఇస్తామని ప్రభుత్వం ప్రకటించించి ఇప్పుడు నట్టేట ముంచుతోంది.

జిల్లాలో 5.5 లక్షలు ఎకరాల్లో సాగు

జిల్లాలోని కృష్ణా పశ్చిమ డెల్టాతో పాటు సాగర్ ఆయకట్టు కింద దాదాపు 5.5 లక్షల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కొమ్ముమూరు ఆయకట్టు కింద లక్ష పైగా ఎకరాల్లో వరి సాగు చేయగా, సాగర్ ఆయకట్టు కింద 4.5 లక్షల ఎకరాల్లో అధికంగా 1262 బీపీటీ సాగు చేశారు. ఈ రకం పంట దిగుబడి వచ్చిన వెంటనే రేషన్ బియ్యం సరఫరా చేసేందుకు గాను మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరలకు అమ్మకాలు చేస్తుంటారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రంలోని మిల్లర్లు జిల్లాకు వచ్చిన దిగుబడులను కల్లాల్లోనే కొనుగులు చేస్తుంటారు. రైతులు కూడా పంట నిల్వ చేస్తే మార్కెట్ ధర ఎలా ఉంటుందో అనే సందేహంతో పంట నిల్వ చేసుకునే సామర్థ్యం లేక కల్లాలోనే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన మిల్లర్లు కుమ్ముక్కై తక్కువ ధరకే పంటను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం 1262, ఎన్ఎల్ఆర్ 3389, బీపీటీ 5204, బీపీడీ 2504, నెల్లూరు సన్నాలు 2580 రకాలు 75 కేజీ బస్తా రూ. 1,300కే దళారులు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ఎకరాకి సగటున రూ.35 వేల నుంచి రూ. 40 వేల వరకు సాగు ఖర్చులు కాగా పంట దిగుబడి ఒక్కో ఎకరాకి 30 నుంచి 35 బస్తాలు వచ్చాయి. దీన్ని బట్టి చూస్తే అన్నదాత చేసిన కష్టానికి ఎకరానికి అయిన పెట్టుబడి కంటే అదనంగా మిగిలే అవకాశమేలేదు. అన్నదాతలకు ఆరుగాలం శ్రమ తప్ప ఫలితం ఉండటం లేదు.

గత ప్రభుత్వంలో ధైర్యం..

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో పండించిన పంటలను ప్రభుత్వమే ప్రభుత్వ సంస్థల **చేత కొను**గోలు చేయాల్సి ఉండగా పంట **కొను**గోలు కేంద్రాలను ఏర్పాటు చేయ**డం** లేదు. గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం మిల్లర్లతో ములాఖత్ అయి ధాన్యాన్ని కల్లాల్లోనే తక్కువ ధరకే కొనుగోలు చేసేలా చీకటి ఒప్పందాలను చేసుకోవడంతో తాము పండించిన పంటలను తక్కువ ధరకు అమ్మకాలు చేస్తున్నారని రైతులు వాపో**తురు.** మరో వారం లో పంట ఇంటికి చే**రనున్నప్ప**టికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ అందలేదు. దీంతో దళారులు, మిల్లర్లు పంట ఇంటికి రాకుండానే కల్లాల్లోనే ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను అప్పుల పాలు చేస్తున్నారు.



రైతులకు మిగిలేదేమీ లేదు



నేను 6 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశా. సాగు కోసం రూ.2.40 లక్షలు ఖర్చు చేశా. ఇప్పుడు పంట కోతకు వచ్చింది. దళారులు బస్తా రూ. 1.300 ఇవ్వమంటున్నారు. లేకపోతే ఉంచుకోమంటున్నారు. కనీసం రైతు భరోసా నిధులకు కూడా ఇవ్వలేదు.

– ఎ. రవిచంద్రా రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు



పంట కోతలు కోయడం ప్రారంభించాం. అయితే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దళారులు బస్తా రూ.1300 కు అడుగుతున్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. వ్యవసాయ చేయడం కష్టంగా మారింది.

– రాఘవ రెడ్డి

భవన నిర్మాణ కార్మికులకు చేయూత


మాట్లాడుతున్న అబ్రహాం

పర్చూరు (చినగంజాం): కార్మిక శాఖలో పేర్లు నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం చేయూత అందిస్తుందని పర్చూరు సహాయ కార్మిక అధికారి ఆర్. అబ్రహం తెలిపారు. శనివారం అవగాహన కల్పించారు. కార్మికులు 5 ఏళ్ల పాటు రూ. 110 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని అన్నారు. మహిళా కార్మికులకు, వారి పిల్లలకు ప్రసూతి ఖర్చుల నిమిత్తం రూ. 20 వేలు, ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికులకు దహన సంస్కారాలు నిమిత్తం రూ. 20 వేలు, రూ. 5 లక్షల వరకు జీవిత బీమా తదితర ఉపయోగాలు ఉంటాయని వివరించారు.

ప్రతి గ్రామంలో ఆదర్శ పాఠశాల ఉండాలి

కారంచేడు: ప్రతి గ్రామంలో ఒక ఆదర్శ పాఠశాల ఉండేలా ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పని చేయాలని ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఏపీ విజయలక్ష్మి అన్నారు. శనివారం స్వర్ణ, కారంచేడు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కారంచేడు ఎన్‌టీఆర్ నగర్, స్వర్ణ మొయిన్ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల నమోదు, హాజరు వంటి వివరాలు సేకరించారు. పర్చూరు, కారంచేడు ఎంఈఓ–2లు మొలబంటి వెంకటేశ్వర్లు, పి. వెంకట్రామయ్య, స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీ సుబ్బారావు, రావి పద్మావతి పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఎలా రద్దు చేస్తారు?

- మండల సర్వ సభ్య సమావేశంలో వాడీవేడి చర్చ


గృహనిర్మాణ శాఖపై సర్వ సభ్యసమావేశంలో జరుగుతున్న చర్చ

చినగంజాం: ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారుల అనుమతి లేకుండా వాటిని ఏవిధంగా రద్దు చేస్తారంటూ మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. చినగంజాం మండల సర్వ సభ్య సమావేశం శనివారం మండల పరిషత్ సమావేశం భవనంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు తాము నిర్మాణాలు ప్రారంభించకుండానే వారి అనుమతులు లేకుండా గృహాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారని కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొని వచ్చారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, గ్రామంలో విచారణ చేయకుండా పంచాయతీలో మొత్తం 53 మంది లబ్ధిదారుల గృహాలను రద్దు చేశారని తెలిపారు. ఫలితంగా వారు భవిష్యత్‌లో ప్రభుత్వ గృహాలు నిర్మాణం చేసుకొనే అవకాశం లేకుండా పోయే ప్రమాదం ఏర్పడిందని చెప్పారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలో ఓ ప్రయివేట్ పాఠశాలకు పంచాయతీ అనుమతులు లేకుండానే పాఠశాల నిర్మాణం చేశారన్నారు. పాఠశాలకు అవసరమైన వసతులు లేకపోయినప్పటికీ అందుకు మండల విద్యాశాఖాధికారి అనుమతులు మంజూరు చేయడం ఏమిటని న్యాయపరమైన పోరాటం చేసేందుకు తాను సిద్ధమవుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీ, ఫిషరీస్, హార్టికల్చర్, అటవీ శాఖ అధికారులు హాజరు కాలేదు. గృహనిర్మాణ శాఖ ఏఈ రాజశేఖర్, ఎంపీడీఓ ఎ. శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

381 పశువులకు పరీక్షలు

బల్లికురవ: ఉచిత పశువైద్య శిబిరాల ద్వారా నట్టల నివారణ మందు, గర్భకోశ వ్యాధులకు గ్రామ గ్రామాన సేవలు అందిస్తున్నట్లు పశువైద్యాధికారులు ఆర్. పావని కుమారి, పి. మహేశ్వరరావు తెలిపారు. శనివారం గుంటుపల్లి బల్లికురవ గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాల ద్వారా 340 గేదెలు దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీతో 41 పశువులకు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేశారు.

ఓటుతో ప్రజాస్వామ్య పరిరక్షణ



చీరాలలోని అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం


కొరిశపాడులో జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


ఇంకొల్లులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు, సిబ్బంది

- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

చీరాల టౌన్: రాజ్యాంగం కల్పించిన ఓటు వజ్రాయుధం వంటిదని..18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందడంతో పాటు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని చీరాల నియోజకవర్గ ఎన్నికల అధికారి, చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు సూచించారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం చీరాలలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ముక్కోణం పార్కు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సీనియర్ సిటిజన్ ఓటర్లను సత్కరించారు. తహసీల్దార్ కె.గోపీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్, ఎన్నికల విభాగం డీటీ సుశీల, వీఆర్వోలు పాల్గొన్నారు.

కారంచేడు: ఓటు హక్కు వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి కాలువ సెంటర్ వరకు ఓటుహక్కు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కుంకలమర్రులో హెచ్ఎం పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): తహసీల్దార్ బ్రహ్మయ్య, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్నికల డీటీ మాధవీలత, బూత్ లెవెల్ అధికారులు యార్లగడ్డ శ్రీనివాసరావు, వై. గోవిందరెడ్డి పాల్గొన్నారు.

వేటపాలెం: ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు గురించి తెలయజేయాలని తహసీల్దార్ పార్వతి అన్నారు. ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

పర్చూరు(చినగంజాం): ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ సమన్వకర్త గాదె మధూసూదనరెడ్డి పిలుపునిచ్చారు. దేశ పౌరులమైన మనం ప్రజాస్వామ్యంపై ప్రగాఢ విశ్వాసం ప్రకటిస్తూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను పాటించాలన్నారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ఎన్నికల గోప్యతను కాపాడుతూ కుల, మత, జాతి, వర్గం, భాష వంటి ఒత్తిడులు, ప్రలోభాలకు లోను కాకుండా ఓటు వినియోగించుకోవాలన్నారు. సమర్థవంతమైన ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు విలువైన ఆయుధం అని అన్నారు.


సమన్వయకర్త గాదె మధుసూదన రెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): పోటీల్లో గెలుపొందిన విజేతలకు తహసీల్దార్ ఎస్. వెంకటరత్నం బహుమతులు అందజశారు. పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఇంకొల్లు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్‌లకు సన్మానం నిర్వహించారు.

ఉత్తమ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా బ్రహ్మయ్య

పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజకవర్గానికి సంబంధించి ఉత్తమ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పర్చూరు తహసీల్దార్ పి. బ్రహ్మయ్య ఎంపికయ్యారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని బాపట్ల నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కలెక్టర్ జె. వెంకట మురళి చేతులు మీదుగా అవార్డు, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఉత్తమ బూత్ లెవెల్ అధికారులుగా పర్చూరు మండలం వీరన్నపాలెం వీఆర్ఏ డి. కిరణ్‌కుమార్, చినగంజాం మండలం పల్లెపాలెం సచివాలయ మహిళా పోలీస్ ఎ. హిమబిందు ఎంపికయ్యారు.

తహసీల్దార్ గోపీకృష్ణకు అవార్డు

చీరాల టౌన్: చీరాల తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ ఉత్తమ సహాయ ఎన్నికల అధికారి అవార్డును అందుకున్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 15వ జాతీయ ఓటరు దినోత్సవంలో కలెక్టర్ జె.వెంకట మురళీ చేతుల మీదుగా ఉత్తమ ఏఈఆర్వో అవార్డు, ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర నాయుడు, వేటపాలెం తహసీల్దార్ పి.పార్వతి, డీటీ డి.అర్జున్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

చినగంజాం: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీఓ ఏ. శ్రీనివాసమూర్తి సీనియర్ ఓటర్లకు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. డీటీ, వీఆర్వోలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, రాధిక, చెంచుపున్నమ్మ, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి: పట్టణంలోని కట్టారామకోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్ట్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో ఆ విభాగాధిపతి గంగయ్య అతిథులకు ఆహ్వానం పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ వి. మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజా స్వామ్యంలో ఓటే వజ్రాయుధమని పాఠశాల ప్రధానోపాధ్యాకుడు నాగేశ్వరరావు అన్నారు. మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు.

అద్దంకి రూరల్: ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈఆర్‌వో విజయజ్యోతి కుమారి అన్నారు. శనివారం స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. డీటీ పి. సురేష్, మున్సిపల్ కమిషనర్ డి. రవీంద్ర పాల్గొన్నారు.

మేదరమెట్ల: కొరిశపాడులో శనివారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. ఎంఈవో పున్నయ్య, రీసర్వే డీటీ రవికాంత్, ఆర్ఐ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ఓటర్లు ఓటు హక్కు గురించి అవగాహన కల్పించారు.

బల్లికురవ: ఓటు హక్కుతో మంచి పాలన అందించే నాయకులను ఎన్నుకోవాలని తహసీల్దార్ రవినాయక్ పిలుపు నిచ్చారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బల్లికురవలో విద్యార్థులతో ప్రతిజ్ఞ, ర్యాలీ, మానవ హారం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నలుగురు సీనియర్ సిటిజన్‌లను సత్కరించారు. డీటీ ప్రహర్ష, రెవెన్యూ సిబ్బంది స్థానిక నేతలు పాల్గొన్నారు.

అద్దంకి తహసీల్దార్‌కు..

అద్దంకిరూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అద్దంకి తహసీల్దార్ శ్రీ చరణ్.. శనివారం బాపట్లలో కలెక్టర్ జె. వెంకటమురళీ చేతుల మీదుగా ఉత్తమ ఏఈఆర్‌డీగా అవార్డు అందుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందించారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

అద్దంకి: ఆంధ్రప్రదేశ్ సీపీఎం 27వ మహాసభలను జయప్రదం చేయాలని పట్టణ పార్టీ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ అద్దంకి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శవివారం సుందరయ్య భవనం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పట్టణ కమిటీ సభ్యులు కె. రఘు చంద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ శాఖలు మండల పట్టణ జిల్లా కమిటీల మహాసభలను జయప్రదంగా నిర్వహించుకుని ఫిబ్రవరి నెల 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరగనున్న రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చతో పాటు రైతు, కార్మిక, కర్షక ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయడంపై తీర్మానాలు చేస్తామని తెలిపారు. పార్టీ సభ్యులు డి. గంగాధర్ టి. రాజు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో సమస్యలకు చెక్

చీరాల టౌన్: భూముల రీ సర్వేతో సమస్యలు లేకుండా ఉంటాయని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే జీవీ ముసలయ్య సూచించారు. చీరాల నగర్ గ్రామ పంచాయతీలో సర్వే చేశారు. ఆర్డీవో టి.చంద్రశేఖర నాయుడు ఆధ్వర్యంలో మేరకు సూచనలను రైతులకు వివరించారు. చీరాల మండలంలో 29,121 ఎకరాలకు గాను 3625 ఎకరాల భూమి రీసర్వే చేశామన్నారు. పాస్‌పుస్తకాలు, 1బి అంగళ్, భూమి హక్కుల పత్రాలతో వచ్చి రీసర్వే చేయించుకోవాలని సూచించారు. మండల సర్వేయర్ చెరుకూరి బ్రాహ్మణయ్య, సచివాలయాల సర్వేయర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

చీరాల టౌన్: ఆడ, మగ తేడా ఉండకూడదని.. లింగ సమానత్వంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి... లింగనిర్ధారణ చేయకుండా స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు సూచించారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్ట్ పూర్వగర్భ, ప్రసవపూర్వ నియంత్రణ చట్టంపై సబ్ డిస్ట్రిక్ట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సమతుల్యత, బాలికల జనన నిష్పత్తి మెరుగు పర్చాలన్నారు.

అబార్షన్లు లేకుండా చూడటం, ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్, స్కాన్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా చర్యలు తీసుకోవడం, భ్రూణ హత్యలు జరగకుండా, బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి మనోజ్‌కుమార్, పీపీ యూనిట్ వైద్యాధికారి యాకోబు, ఎన్జీవోలు, వైద్యులు డాక్టర్ హసీనా, డాక్టర్ విజయ్‌కుమార్, రాజా సాల్మన్, చింతా శేషుబాబు, జాన్, అనిల్ పాల్గొన్నారు.